క్లుప్తంగా

సచివాలయాలతో మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

వంగర: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి ఎం.సీతారాంపురం సచివాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లతో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్షించారు. కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

స్ప్రింక్లర్ పైపులతో సాగునీటి ఆదా



పనసలవలసలో స్ప్రింక్లర్ పైపులు పరిశీలిస్తున్న మైక్రో ఇరిగేషన్ జేడీ లక్ష్మీనారాయణ

రేగిడి : రాయితీపై అందిస్తున్న స్ప్రింక్లర్ పైపులు సాగులో ఎంతో ఉపయోగపడతాయని మైక్రో ఇరిగేషన్ జిల్లా సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలో పారంపేట, పనసలవలస గ్రామాల్లో రైతులకు రాయితీపై అందించిన స్ప్రింక్లర్ పైపులను క్షేత్ర స్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదెకరాల విస్తీర్ణంలో సాగుభూమి కలిగిన రైతులకు బిందుసేద్యం నిమిత్తం 90 శాతం రాయితీతో ఈ పైపులు అందిస్తున్నామని తెలిపారు. తుంపర సేద్యానికి సంబంధించి రైతులకు రాయితీపై కూడా పైపులు ఇస్తున్నామని అన్నారు. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గేదెల గోవిందనాయుడు, రైతులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా దాడితల్లి

బొబ్బిలి: పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారు శుక్రవారం శాకాంబరీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



శాకంబరీదేవిగా అమ్మవారు


మత్స్యకారులకు శిక్షణ



శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రేగిడి : మండలంలో ఐదు రోజులుగా క్షేత్ర స్థాయిలో మత్స్యకారులకు ఇచ్చిన శిక్షణను భవిష్యత్‌లో చక్కగా వినియోగించుకోవాలని ఫిషరీస్ డవలప్‌మెంట్ ఆఫీసర్ ఐ.శ్రీనివాసరావు, రాజాం మత్స్య శాఖ సహాయ అధికారి సీహెచ్‌వీవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని వావిలవలస గ్రామంలో నేషనల్ ఫిషరీస్ డవలప్‌మెంట్ సౌజన్యంతో ఐదు రోజులు పాటు మత్స్యకారులకు శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో గజపతినగరం అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిషరీస్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ మొయిద ప్రసన్నలక్ష్మీ, వైఎస్సార్‌సీపీ నేత మొయిద శ్రీనివాసరావు, వీఎఫ్‌ఏ శారద, శ్రీనివాసరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన గౌరునాయుడు

బాడంగి: మండల విద్యాశాఖాధికారిగా డి.గౌరునాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గజపతినరం మండలం పురిటిపెంట ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇక్కడ ఎంఈఓగా (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంఈఓగా పనిచేసిన జి.కృష్ణమూర్తికి ఎల్.కోట మండలం కళ్లేపల్లి రేగ హైస్కూల్ హెచ్‌ఎంగా బదిలీ కావడంతో ఇక్కడ ఎంఈఓ పోస్టు ఖాళీ అయింది. దీంతో గౌరునాయుడు ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఎంఈఓ -2గా ఎం.రాజేశ్వరి నియమితులయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో శనివారం విద్యుత్ సరఫరాలో నిలుపు చేయనున్నామని ఏఈ కుమార్ శుక్రవారం తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా స్తంభాల మార్పు చేస్తున్న దృష్ట్యా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. సంబంధిత ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, చిత్రంలో ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తేనే మండల అభివృద్ధి సాధ్యమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్‌లతో కలసి శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సాధారణ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా అందించేందుకు ఎంతో కష్టపడుతున్నారని, అధికారులు అంతా తమ వంతు సాయం అందించి, లబ్ధిదారునికి సకాలంలో పథకాలు అందేలా చేయాలని సూచించారు. తొలుత సమావేశంలో విద్య, గృహ నిర్మాణ, వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, ఐసీడీఎస్, రెవెన్యూ శాఖలపై సమీక్ష జరిగింది. ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు పాఠ్యపుస్తకాలు పంపిణీ, నాడు - నేడు పనులు నిర్వహణ, జగనన్న కిట్లు అందజేత, అమ్మ ఒడి లబ్ధిదారులు వివరాలు తెలిపారు. మండలంలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని హౌసింగ్ ఏఈ వేణుగోపాలరావు వివరించారు. వ్యవసాయానికి సంబంధించి ముందస్తుగా విత్తన పంపిణీ సక్రమంగా జరుగుతుందని వ్యవసాయ శాఖ అధికారి జి.మురళీకృష్ణ వివరించారు. ఐసీడీఎస్ శాఖపై జరిగిన సమీక్షలో రాజాం ప్రాజెక్ట్ పరిధిలో నాలుగు మండలాలు ఉండడంతో పర్యవేక్షణకు ఇబ్బంది కలుగుతుందని రేగిడి, వంగర మండలాలను ఒక ప్రాజెక్ట్‌గా విభజించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఏసీడీపీఓ సిమ్మాలమ్మకు సూచించారు. సమావేశంలో పలు తీర్మాణాలు చేసి ఆమోదించారు. రేగిడి మండలం ఏవీపురం గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లోకి పూర్తి స్థాయిలో ఇంటింటికి తాగునీటిని అందిస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యే జోగులు మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, రేగిడి మండలంలో కూడా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశామని వివరించారు. ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు అన్నిశాఖల అధికారులు సహకరించాలని, వారి సూచనలు తీసుకుంటూ పాలనలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. ఇదిలా ఉండగా తోటపల్లి, మడ్డువలస సాగునీటి ప్రాజెక్ట్‌లకు సంబంధించిన అధికారులు గైర్హాజరుపై ఎంపీ బెల్లాన అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి గైర్హాజరుకు సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓ నాగమణికి ఆదేశించారు. సమావేశంలో ఎంపీపీ ధార అప్పలనరసమ్మ, వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, ఎంపీడీవో నాగమణి, తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

- డీఎస్పీ శ్రీధర్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

రామభద్రపురం: శాంతి, భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ శ్రీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ తిరుమలరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రామాలలో శాంతి,భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్నామన్నారు. అలాగే మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా పోలీస్ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిత్యం వాహన తనిఖీలు చేపడుతున్నమని తెలిపారు. సైబర్ నేరాలకు గురికాకుండా గ్రామాల్లో సచివాలయ పోలీసుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా గ్రామీణ ప్రాంతాలు, కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు ఛిద్రమవుతాయని హెచ్చరించారు. రామభద్రపురం అంతర్రాష్ట్ర కూడలి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువై ట్రాఫిక్ సమస్య ఉందని, అయినప్పటికీ పోలీసులతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను వినియోగించుకోండి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూలై 1 నుంచి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమమే జగనన్న సురక్ష అని అన్నారు. ప్రజలు తమకు కావాల్సిన సేవల వివరాలను వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు వివరించి టోకెన్ పొందాలన్నారు. ఆ టోకెన్‌తో ఆయా సచివాలయ పరిధిలో ఇచ్చిన టైమ్ షెడ్యూల్ ప్రకారం వెళ్లి సేవలు పొందవచ్చని చెప్పారు. 13 రకాల సేవలకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోధరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం..



రామభద్రపురం శ్రీరాంనగర్‌కోలనీలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

- ప్రజా సంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యం
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

రామభద్రపురం: ఏం అవ్వా..ఫించన్ ప్రతి నెలా ఇంటికి వచ్చి ఇస్తున్నారా..ఏం అన్నా ప్రభుత్వం నుంచి పథకాలు సక్రమంగా అందుతున్నాయా..అక్కా వైఎస్సార్ చేయూత సొమ్ము అందిందా.? ఇలా ఇంట్లో కుటుంబ సభ్యుడిలా ఒక్కొక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మమేకమయ్యారు. మండల కేంద్రంలోని శ్రీరాంనగర్‌కాలనీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని తెలియజేస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సమయంలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇది ప్రజా ప్రభుత్వమని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు వందలకు పైగా హామీలిచ్చి అందులో కనీసం పది శాతమైనా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. అదే సమయంలో 2019లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని చెప్పారు. టీడీపీ ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోను చూసి అన్ని రంగాల వారు నవ్వుకుంటున్నారన్నారు. నిత్యం అబద్ధాలు ఆడుతూ అనుకూలమైన దిన పత్రికల్లో పిచ్చి రాతలు రాయించుకుంటున్నారని మండిపడ్డారు. 2024లో మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, కటికి చిన్నారావు, డర్రు పైడిరాజు, కటికి శ్రీనివాసరావు, తదిరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట



విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: రాష్ట్రంలో విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండల పరిధి రుషింగి పాఠశాల నుంచి నవోదయ, రెసిడెన్షియల్ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు అందజేసి అభినందించారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు - నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయని, ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు యలకల అన్నంనాయుడు, యలకల శ్రీనివాసరావు, యలకల వాసునాయుడు, ఎంఈవో వై.దుర్గారావు, సచివాలయ సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' విజయవంతానికి కృషి చేయండి



మాట్లాడుతున్న జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు

రామభద్రపురం: మండలంలో శనివారం నుంచి నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు అన్నారు. కొట్టక్కి సచివాలయంలో వలంటీర్లు, గృహసారథులతో శుక్రవారం నిర్వహించిన వారు మాట్లాడుతూ, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందజేయడం, ప్రజా సమస్యలు సంతృప్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు, భూ కొనుగోలు అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు, ఆన్‌లైన్‌లో భూ వివరాల నమోదులో మార్పులు, తదితర సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు.



పక్కిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితరులు

ప్రజావసరాలపై ఆరా..

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలు తమకు కావాల్సిన ధ్రువపత్రాలు, సేవలను పొందాలని ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లకు శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలసి వారి అవసరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోధరరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఎంపీడీఓ కార్యాలయం వద్ద జగనన్న సురక్ష వాల్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లు, బ్యానర్లను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అర్హులైన కుటుంబాలకు 100 శాతం మేలు చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి నవరత్నాల పథకాలకు సంబంధించి అర్హత ఉండి పథకం వర్తించకపోతే అటువంటి వారి వివరాలను, అలాగే ప్రజలు, రైతులు, విద్యార్థులకు అవసరమైన 11 రకాల సిటిజన్ సర్వీసులను ఉచితంగా ఇచ్చేందుకు సర్వే చేస్తారని తెలిపారు. మండలంలోని తెర్లాం-1, చీకటిపేట గ్రామ సచివాలయాల్లో సర్వే చేశామని, వారందరికీ అవసరమైన ధ్రువపత్రాలు శనివారం ఆయా సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి అందజేస్తామన్నారు. ఆయనతోపాటు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీను, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ అభివృద్ధి, సంక్షేమం అందుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కాశిందొరవలసలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రాల భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామాలకు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి గ్రామ స్వరాజ్యానికి బాటలు వేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిదేనన్నారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులను కూడా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి, సర్పంచ్‌లు కరణం దాలెమ్మ, జాగరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు గొర్లె తిరుపతిరావు, మండల జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోధరరావు, కడుపుకూటి సూర్యారావు, ఉత్తరావల్లి అప్పలనాయుడు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సచివాలయ భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

ప్రశాంతంగా అర్హత పరీక్ష

బాడంగి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఖాళీలను భర్తీ చేసేందుకు శుక్రవారం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు 151 మంది దరఖాస్తు చేసుకోగా.. 92 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ టి. రామదాసు తెలిపారు.

బదిలీ ఉద్యోగులకు వీడ్కోలు..

గురుకులంలో గతంలో జేఎల్‌గా పనిచేసిన జ్యోతిశ్రీ, స్వర్ణలతలతో పాటు ఐదు గురు గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులకు బదిలీ కావడంతో వారిని శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో గురుకులం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

బొబ్బిలి: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల నారాయణి హార్ట్ సెంటర్ వద్ద రిటైర్డ్ ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా శనివారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ రరౌతు రామమూర్తి నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ శిబిరంలో గుండె, సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, రిటైర్డ్ ఉద్యోగులంతా ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో చురుగ్గా జగనన్న సురక్ష సర్వే

తెర్లాం: మండలంలోని నెమలాం, తెర్లాం-2 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష సర్వే చురుగ్గా జరుగుతోంది. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశాల మేరకు ఆయా గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికీ వెళ్లి 11 రకాల సిటిజన్ సర్వీసులపై ప్రజలకు తెలియజేసి, వారికి అవసరమైన ధ్రువపత్రాలు ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకుంటున్నారు. గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేస్తున్నారు.

'వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి'

బొబ్బిలి: పట్టణంలోని శాఖా గ్రంథాలయ భవనానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు రూ.1.61లక్షలు మంజూరు చేశారని, త్వరలో పనులు చేపడతామని జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు (విసు) అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక కౌన్సిలర్ కృష్ణవేణితో పాటు తాను ఎమ్మెల్యేను కలసి గ్రంథాలయ పరిస్థితిని వివరించగా వెంటనే ఆయన స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. పేటీఎం బ్యాచ్ అయిన జనసేన కార్యకర్తలకు విషయం తెలియక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నిజానిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

కొలతల ప్రకారం పనులు

రాజాం : కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే గిట్టుబాటు అవుతుందని వేతనదారులకు ఎంపీడీవో బాసూరి శంకరరావు సూచించారు. మండలంలోని వీఆర్ అగ్రహారం, బొద్దాం, పెనుబాక తదితర గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు శుక్రవారం పరిశీలించారు. వేతనదారుల హాజరుపై ఆరా తీశారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. పట్టణంలోని హరిజన వీధి, మాదిగ వీధి వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. టీడీపీ వస్తే సంక్షేమాన్ని పక్కన పెడుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. టీడీపీ పాలనలో ప్రజలకు ఒక్క సంక్షేమ పథకమైనా పారదర్శకంగా అందిందా.. అని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు, పట్టుశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ బొల్లా లలిత కుమారి, సచివాలయ కన్వీనర్ సింబాల రాము, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగులు